
# వాహనాల కోసం నివేదికలు అందజేయండి

**పోలింగ్ మెటీరియల్ సరఫరాకు 138 సెక్టార్లు, 149 రూట్లుగా విభజన**

**4,380 మంది పోలింగ్, 2,190 మంది పోలీసు సిబ్బంది నియామకం**

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల**

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఎన్నికల ప్రక్రియకు అవసరమైన వాహనాల కోసం నివేదికలు వెంటనే అందజేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీవోసీ కార్యాలయం మినీ సమావేశ మందిరంలో రవాణా కార్యాచరణ నివేదిక, నామినేషన్ ప్రక్రియకు ఆర్వో కార్యాలయాల్లో ఏర్పాట్లు, 31వ తేదీ వరకు నూతన ఓటర్లు నమోదు తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలోని 1,095 పోలింగ్ కేంద్రాలకు మెటీరియల్ సరఫరాకు 138 సెక్టార్లు, 149 రూట్లుగా విభజించామన్నారు. పోలింగ్ నిర్వహణకు 4,380 మంది పోలింగ్ సిబ్బంది, 2,190 మంది పోలీసులు మొత్తం 6,570 మంది జాబితా సిద్ధం చేసినట్లు చెప్పారు. నియోజకవర్గాల వారిగా అవసరమైన వాహనాల కోసం మినీ, పెద్ద వాహనాలతోపాటు ఆర్టీసీ బస్సులు వివరాలను అందజేయాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. మొత్తం 217 వాహనాలు అవసరమవుతున్నట్లు ప్రాథమికంగా నివేదికలు సిద్ధం చేశామని, రిటర్నింగ్ అధికారులు పరిశీలన చేసి అవసరాన్ని బట్టి నివేదికలు అందజేయాలన్నారు. మారుమూల ప్రాంతాలు, పట్టణాలకు మెటీరియల్‌తో వెళ్లాల్సి ఉన్నందున అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలన చేసి వాహనాలు అవసరత కోసం నివేదికలు అందజేయాలన్నారు. ఈ నెల 31వ తేదీ



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

వరకు 18 ఏళ్లు నిండిన వారు నూతన ఓటరుగా నమోదు కావడానికి అవకాశం ఉన్నందున వచ్చిన దరఖాస్తులు ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయాలని చెప్పారు. నవంబర్ 3వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతున్నందున రిటర్నింగ్ అధికారులు వారివారి కార్యాలయాల్లో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గ పరిధిలో ప్రసారమవుతున్న సిటీ కేబుల్స్‌లో ప్రసారమయ్యే రాజకీయ ప్రకటలను పర్యవేక్షణ చేయాలన్నారు. ముందస్తుగా సిటీ కేబుల్స్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించి ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, ప్రీ సర్టిఫికేషన్ జారీ తదితర వివరాలను తెలియజేయాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. సమావేశంలో అశ్వారావుపేట, కొత్తగూడెం, భద్రాచలం రిటర్నింగ్ అధికారులు రాంబాబు, శిరీష, మంగీలాల్, డీఆర్వో రవీంద్రనాథ్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు దారా ప్రసాద్, నియోజకవర్గ కేంద్రంలోని సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

### రాజకీయ ప్రకటనలపై నిరంతర పర్యవేక్షణ

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 28 : రాజకీయ ప్రకటనలపై ఎంసీఎంసీ కమిటీ నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో ఎన్నికల ప్రక్రియలో జారీ చేయాల్సిన ప్రీ సర్టిఫికేషన్, ఫెయిడ్ న్యూస్, సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలపై ఎంసీఎంసీ, సోషల్‌మీడియా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలుచేయడంలో భాగంగా వివిధ మాధ్యమాల ద్వారా ప్రసారమయ్యే ప్రకటనలను నిరంతరం పర్యవేక్షిస్తూ లోకల్ ప్రచారం కోసం అవసరమయ్యే అనుమతులను జిల్లా మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ జారీ చేయాలన్నారు. కమిటీ సభ్యులు నిరంతరం వివిధ దినపత్రికలు, టెలివిజన్, సామాజిక మాధ్యమాలు, సిటికేబుల్ తదితర ప్రచార మాధ్యమాల ద్వారా ప్రసారమయ్యే చెల్లింపు వార్తలు, రాజకీయ ప్రకటనలను తనిఖీ చేసి నివేదికలను ఎన్నికల అధికారులకు పంపించాలన్నారు. సమావేశంలో ఎంసీఎంసీ కన్వీనర్ డీపీఆర్వో శ్రీనివాస్, అకాశవాణి ప్రోగ్రాం అధికారి శ్రీనివాసన్, కమిటీ సభ్యుడు జనుమాల రమేశ్, ఈడీఎం విజయసారధి, జిల్లా సమాచార విజ్ఞాన అధికారి సుశీల్‌కుమార్, ఎస్పీ పీఆర్వో డి.శ్రీనివాస్, పోలీస్ ఐటీ పరిశీలకుడు నరేన్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెలాఖరు వరకు కొత్త ఓటర్లకు అవకాశం

**కలెక్టర్ ప్రియాంక ఆల**

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 28 : నెలరోజుల్లో జరగబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకునేందుకు ఈ నెల 31వ తేదీ వరకు 18 సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. ఓటుహక్కు నమోదుపై జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో అవగాహన కల్పిస్తూ ప్రచారం చేస్తున్నామని చెప్పారు. 18ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తి ఓటు నమోదుకు అర్హుడేనని, రాబోయే ఎన్నికల్లో ఓటు వేయాలంటే ఈ నెల 31వ తేదీ లోపు నూతన ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. 31వ తేదీ తర్వాత నమోదుకు అవకాశం ఉందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉన్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్లు మొదలైతే నూతన ఓటు దరఖాస్తుకు అవకాశం ఉండదని, వచ్చే నెల మొదటివారంలో అభ్యర్థుల నామినేషన్లు మొదలవుతుండటంతో ఈ నెల 31వరకే నూతన ఓటర్లు తమ ఓటు నమోదు చేసుకునేందుకు చివరితేదీగా ఎన్నికల కమిషన్ నిర్ణయించినట్లు చెప్పారు.

## వరిలో ఆకుముడతను నివారించాలి

**కేవీకే కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ**



వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

చుంచుపల్లి, అక్టోబర్ 28 : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో చిరుపొట్ట, పొట్ట దశల్లో ఉన్న వరి పంటలో ఎక్కువగా ఆకుముడత(తెల్ల/మజ్జిగ తెగులు) ఉధృతిగా ఉందని, వెంటనే దానిని నివారించాలని జిల్లా కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ రైతులకు సూచించారు. శనివారం హేమచంద్రాపురం గ్రామంలో వరిపొలాలను పరిశీలించారు. ఆకుముడత లార్వాలు ఆకులను చుట్టుగా చుట్టి లోపల నుంచి పత్రహరితాన్ని తింటాయని, దీనివల్ల కిరణజన్య సంయోక్రియ తగ్గి పంట దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉందన్నారు. రైతులు జాగ్రత్తలు పాటించి ఆకుముడత పురుగును సకాలంలో నివారించాలని జిల్లా వ్యవసాయ వాతావరణ విభాగం పర్యవేక్షకుడు సుమన్ సూచించారు. నత్రజని ఎరువులు మోతాదు మించివాడడం వల్ల, వెడల్పాటి ఆకులు ఉన్న ఎంటీయూ 1262, 1282 లాంటి వరిరకాలను ఆలస్యంగా నాట్లు వేయడం, పొలంలో చుట్టూ చెట్ల నీడ ఉన్న ప్రదేశాల్లో ఈ పురుగు ఉధృతి అధికంగా ఉంటుందన్నారు.

## ఉద్యోగులు ప్రచారంలో పాల్గొనవద్దు

**మెప్మా డీఎంసీ రాజేశ్**



ఆర్పీలకు శిక్షణ ఇస్తున్న డీఎంసీ రాజేశ్

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 28 : రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా డ్వాక్రా గ్రూపు సభ్యులుగా రిసోర్స్‌పర్సన్లు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఉద్యోగులు సేవలు అందించాలని జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ రాజేశ్ అన్నారు. శనివారం మెప్మా కార్యాలయంలో జరిగిన రిసోర్స్‌పర్సన్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రిసోర్స్ పర్సన్లు, ఉద్యోగులు ఎటువంటి రాజకీయ పార్టీల ప్రచారంలో పాల్గొనవద్దని, పాల్గొంటే ఉద్యోగం కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ మేరకు ఎలక్షన్ కమిషన్ విడుదల చేసిన ప్రకటనను ఆయన ఉద్యోగులకు చదివి వినిపించారు. సమావేశంలో టీఎంసీలు వెంకటేశ్వర్లు, శాంతకుమార్, మౌలానా, వీవోలు బిందు, షభానా, నాగమణి పాల్గొన్నారు.

## నాలుగు లీటర్ల సారా పట్టివేత

జూలూరుపాడు, అక్టోబర్ 28 : ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న నాలుగు లీటర్ల సారాను స్థానిక పోలీసులు శనివారం పట్టుకున్నారు. మండల పరిధిలోని గుండ్లరేవు గ్రామానికి చెందిన భూక్యా నరేశ్, మురళి నాలుగు లీటర్ల సారాను తీసుకొని ద్విచక్ర వాహనంపై జూలూరుపాడు వైపు వస్తున్నారు. అన్నారుపాడు సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి సారాను స్వాధీనం చేసుకొని ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పురుషోత్తం పేర్కొన్నారు.

# విద్యార్థులకు ఆన్‌లైన్ 'ఓపెన్ హౌజ్'

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 28 : పోలీస్ అమరవీరుల సంస్మరణోత్సవాల్లో భాగంగా జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులకు త్రీ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం ఆన్‌లైన్ 'ఓపెన్ హౌజ్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వినీత్ మాట్లాడుతూ పోలీస్‌శాఖ ద్వారా ప్రజలకు సేవ చేయడం గర్వకారణమన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన వారి త్యాగాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయడం కోసం ప్రతి ఏటా 'పోలీస్ అమరవీరుల సంస్మరణోత్సవాలు' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సైకిల్‌ర్యాలీలు, రక్తదాన శిబిరాలు, వ్యాసరచన, ఫొటోగ్రఫీ పోటీలు, ఆన్‌లైన్ ఓపెన్ హౌజ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లాలోని సుమారు 120 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రస్తుతం పోలీస్ శాఖలో ఉపయోగిస్తున్న ఆయుధాలు, బాంబు స్క్వాడ్ సామగ్రి, డాగ్ స్క్వాడ్ గురించి పోలీస్ అధికారులు వివరించారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను భావిభారత పౌరులైన విద్యార్థులు ప్రతి ఒక్కరూ తెలుకొని వారి స్ఫూర్తితో ముందుకెళ్లాలని ఎస్పీ ఆకాంక్షించారు. పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో, రిసెప్షన్, స్టేషన్ రైటర్, బ్లూ కోల్ట్స్ పనితీరు, పోలీస్ వాహనాల వినియోగం గురించి విద్యార్థులకు వివరించారు. త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఒడ్డెపల్లి మురళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం.కరుణాకర్, ఆడ్మిన్ ఆర్ఐ బోలెం రవి, ఎంటీవో సుధాకర్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, ఆర్ఐ నాగేశ్వరరావు, ఐటీ కోర్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సతీశ్, ట్రాఫిక్ ఎస్సై కొండపర్తి నరేశ్, పీఆర్వో దాములూరి శ్రీనివాస్, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆయుధాలను పరిశీలిస్తున్న ఎస్పీ వినీత్ గంగన్న

### గిరిజనులపై దాడులు హేయమైన చర్య

కొత్తగూడెం క్రైం/ భద్రాచలం, అక్టోబర్ 28 : ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే అమాయక గిరిజనులపై మావోయిస్టులు చేస్తున్న దాడులు హేయమైన చర్య అని ఎస్పీ డాక్టర్ వినీత్ గంగన్న అన్నారు. ఇటీవల మావోయిస్టుల దుశ్చర్యలో మందుపాతర పేలి ఆవును కోల్పోయిన గిరిజనుడిని ఎస్పీ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో నివసించే ప్రజలను మావోయిస్టు పార్టీ నాయకులు మీటింగుల పేరుతో బెదిరింపులకు పాల్పడున్నారన్నారు. అమాయక గిరిజనుల నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిపారు. అడవినే నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీలపై దాడులు చేయడం సరికాదన్నారు. మావోయిస్టుల వల్ల నష్టపోయిన గిరిజనుడికి ఎస్పీ ఆర్థికసాయం అందజేశారు.

## పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని సాధించాలి

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 28 : మున్సిపాలిటీలో ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన పన్నుల లక్ష్యాన్ని చేరుకోవాలని, ప్రణాళికాబద్ధంగా పన్నులు వసూళ్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘు అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో బిల్ కలెక్టర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నెల ప్రభుత్వం విధించిన పన్నుల లక్ష్యాన్ని ఆర్థిక సంవత్సరం మొత్తం పన్నుల లక్ష్యాన్ని బిల్ కలెక్టర్లకు వివరించి ఇప్పటివరకు ఎంత వసూలు చేశారో ప్రతి బిల్ కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. మొండిబకాయిల గురించి వివరిస్తూ ఏ విధంగా వసూలు చేయాలో అందుకు అనుగుణంగా చేపట్టబోయే చర్యలను తెలిపారు. మొండి బకాయిదారులకు తొలుత నోటీసులు అందజేయాలని, పన్నులు చెల్లించని పక్షంలో ఆస్తులు జప్తు చేయాలన్నారు. మేనేజర్ సత్యనారాయణ, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

## గెలుపు బాధ్యత టీబీజీకేఎస్‌దే..

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 28 : సింగరేణి విస్తరించి ఉన్న ఆరు జిల్లాల్లోని కోల్‌బెల్టు ఎమ్మెల్యేలను గెలిపించే బాధ్యత టీబీజీకేఎస్‌దేనని 11 మెన్ కమిటీ మెంబర్ కాపు కృష్ణ అన్నారు. శనివారం గోదావరిఖనిలో కేంద్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావ్, జనరల్ సెక్రటరీ మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగెర్ల మల్లయ్య పాల్గొన్న ఈ సమావేశంలో కృష్ణ మాట్లాడారు. కార్మికులకు 250 గజాల స్థలాలు జిల్లా కేంద్రంలో ఇచ్చేవిధంగా మ్యానిఫెస్టోలో పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఏరియా నుంచి రజాక్, వీరభద్రం, మురాద్, విప్లవ్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాపు కృష్ణ